సాక్షి
చిత్తూరు
సోమవారం, 1, మే, 2023



ఉసురు తీస్తున్న 'ఉచ్చులు'

వేటగాళ్లు పన్నుతున్న విద్యుత్ ఉచ్చుల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు.

- 8లో



నేటి నుంచి కుంభాభిషేకం

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయ మహాకుంభాభిషేకాన్ని సోమవారం నుంచి నిర్వహించనున్నారు.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	24
తిరుపతి	32	25
తిరుమల	27	21
గూడూరు	32	26
నగరి	33	25

న్యూస్‌రీల్

వరసిద్ధుని దర్శనానికి 5 గంటలు



భక్తులతో కిక్కిరిసిన క్యూ

కాణిపాకం(యాదమరి):కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి సుమారు 5 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో క్యూలు, కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయని తెలిపారు. వేసవి నేపథ్యంలో భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి పకడ్బందీ ఏర్పాట్లు చేయించారు. ఎప్పటికప్పుడు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేపట్టారు.

న్యాయవాదుల క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: న్యాయవాదుల సంఘం వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం నగరంలోని మెసానికల్‌మైదానంలో క్రీడా పోటీలను జిల్లా జడ్జి భీమారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. న్యాయవాదుల క్రీడలను చిత్తూరులో నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లారి ద్వారకనాథరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌నందయాదవ్ పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి రేషన్ సరకులు పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. కార్డుదారులకు బియ్యంతోపాటు కందిపప్పు, చక్కెర, రాగులు అందజేయనున్నట్లు వెల్లడించారు. రాగులను మాత్రం రెండు రోజుల తర్వాత నుంచి ప్రతి కార్డుకు 3 కిలోల చొప్పున తీసుకోవచ్చని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందనకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై నేరుగా వినతులు అందించవచ్చని తెలిపారు.

వెబ్‌సైట్‌లో ఇంటర్ మార్కుల మెమో

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఫలితాల మార్కుల షార్ట్ మెమో జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టారు. ఈ మేరకు విద్యార్థులు మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. అవసరమైన విద్యార్థులు www.bieap.apcgss.in వెబ్‌సైట్‌లో మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

శరవేగంగా బోయకొండ అభివృద్ధి



భూమి పూజ చేస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బోయకొండ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆదివారం గంగమ్మ ఆలయం వద్ద మండపం నిర్మించేందుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు భక్తుల సౌకర్యార్థం రూ.43లక్షల వ్యయంతో మండపం నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం చలివేంద్రాలను ప్రారంభించారు. ఈఓ చంద్రమౌళి, నేతలు వెంకటరమణారెడ్డి, లడ్డూరమణ, గంగిరెడ్డి, నవీన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆలయం

గంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

భూసారం.. సాగుకు సహకారం

అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది. సాగుకు పూర్తిగా సహకారం అందిస్తోంది. వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులను ప్రవేశపెడుతోంది. ఆరుగాలం కష్టించే కర్షకుడిని ఆదాయ మార్గంలో నడిపించేందుకు చర్యలు చేపడుతోంది. రైతుకు అవసరమైన అన్ని సేవలను ఆర్‌బీకేల ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ క్రమంలో ఉచితంగా భూసార పరీక్షలను చేయించుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే వెసులుబాటు కల్పిస్తోంది. పొలంలోని పోషకాలను బట్టి ఎరువులు వినియోగించుకునే అవకాశం అందిస్తోంది.

- పకడ్బందీగా మట్టి నమూనాల సేకరణ
- పర్యవేక్షిస్తున్న ఆర్‌బీకేల సిబ్బంది
- వ్యవసాయంలో వినూత్న విధానాల అమలు
- పోషకాలకు తగ్గట్టు ఎరువులు వాడాలంటున్న నిపుణులు
- రైతులకు ఎప్పటికప్పుడు సలహాలందిస్తున్న అధికారులు



మట్టి సేకరిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది (ఫైల్)

మట్టి సేకరణ ఇలా..

భూసార పరీక్షలు చేయించుకునేందుకు రైతులు తమ పొలంలో మట్టిని సేకరించి సమీపంలోని ఆర్‌బీకేలో అందజేయాలి. పంట కోత తర్వాత, వేసవిలో సాగు చేయని సమయంలో భూసార పరీక్షలకు అవసరమయ్యే మట్టిని సేకరించాల్సి ఉంటుంది. ముందుగా పొలంలో 'వి' ఆకారంలో 15 నుంచి 20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీయాలి. అందులో పై పొర నుంచి కింది వరకు ఒకవైపు మట్టిని తీయాలి. ఇలా పొలంలో మొత్తంగా 8 నుంచి 10 చోట్ల మట్టిని సేకరించారు. తర్వాత ఆ మట్టిని బాగా కలపాలి. దాన్ని నాలుగు భాగాలు చేసి, నమూనాకు అవసరమైన మట్టిని వేరుచేసి బాగా ఆరబెట్టాలి. తర్వాత ప్లాస్టిక్ బ్యాగ్ లేదా పాలిథిన్ కవర్లో నింపి రైతు వివరాలు రాయాలి. అనంతరం ఆర్‌బీకేల్లో అందజేస్తే, వారు భూసార పరీక్షా కేంద్రాలకు ఆయా నమూనాలను పంపిస్తారు. ఫలితాలను రైతులకు తెలియజేస్తారు. ఈక్రమంలోనే మట్టి నమూనాలను గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(జీపీఎస్)తో అనుసంధానం చేస్తున్నారు.

సాక్షి, చిత్తూరు : భూమిలో సహజ సిద్ధంగానే పోషక విలువలుంటాయి. కానీ, రసాయన ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల అవి క్రమేణా నశించిపోతున్నాయి. దీంతో రైతులు ఆశించిన మేర దిగుబడి సాధించలేక నష్టపోతున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అన్నదాతకు అండగా నిలిచేందుకు రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించింది. అలాగే భూమిలో పోషకాల స్థాయి, స్థితిగతులను తెలుసుకునేందుకు భూసార పరీక్షలు చేయిస్తోంది.

క్షేత్రస్థాయిలో అవగాహన

భూసార పరీక్షల ద్వారా చేకూరే లబ్ధిని వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి రైతు తన పొలంలో పోషకాల విలువ స్థాయిని తెలుసుకునేలా చర్యలు చేపడుతున్నారు.

ప్రతి మూడేళ్లకూ పరీక్ష అవసరం

భూసార పరీక్షలను ప్రతి మూడేళ్లకు ఒకసారి చేయించుంటే మంచిదని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. దీంతో భూసార స్థితిని భౌతిక రసానిక పద్ధతులలో విశ్లేషించి పోషక విలువలు, నేల స్వభావాన్ని కచ్చితంగా తెలుసుకునే అవకాశముంటుందని వెల్లడిస్తున్నారు. ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో అవగాహన వస్తుందని వివరిస్తున్నారు. లోపించిన పోషకాలను సకాలంలో అందించడం వల్ల భూమి సారవంతంగా మారి మంచి దిగుబడి పొందవచ్చని తెలియజేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చాం



రైతులు భూసార పరీక్షలు చేయించుకునేందుకు సాయం చేయాలని ఆర్‌బీకే సిబ్బందిని ఆదేశించాం. దీనిపై వారికి క్షేత్రస్థాయిలో పూర్తి శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం పంటలు కోత దశలో ఉన్నాయి. ఈ సమయంలో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరిస్తే మంచిది. రాబోయే సీజన్‌లో అదనుకు తగ్గట్టు పంట వేసుకోవచ్చు. అవసరాల మేర పోషకాలను అందించే ఎరువులు వాడుకోవచ్చు.

– శివకుమార్, ఏడీఏ, పుంగనూరు

సంపూర్ణ సహకారం



జిల్లావ్యాప్తంగా భూసార పరీక్షలు చేయిస్తున్నాం. మొత్తం 502 రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఇప్పటికే మట్టి నమూనాల సేకరణపై పని చేస్తున్నారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు సంపూర్ణంగా సహకరిస్తున్నాం. అన్నదాతలు చక్కటి దిగుబడి సాధించేందుకు అవసరమైన సలహాలను అందజేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగును సంబరంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం.

– సగిలి షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

రైతులకు అవగాహన



పొలాలకు భూసార పరీక్షలు తప్పనిసరి. ఏ పంట వేయాలన్నా భూమిలో పోషకాలు ఉంటేనే ఆదాయం పొందగలం . దీనిపై ఇప్పటికే రైతులకు అవగాహన వచ్చింది. రైతు భరోసా కేంద్రాల వద్దకే వారు మట్టి నమూనాలను తీసుకువస్తున్నారు. మరికొందరు అనుమానాలుంటే ఫోన్ ద్వారా సంప్రదిస్తున్నారు. రైతులకు మేలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– జయశ్రీ, ఆర్‌బీకే ఇన్‌చార్జి, దుర్గసముద్రం, చౌడేపల్లె మండలం

దిగుబడి పెరిగింది



భూసార పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా చేయించడం అభినందనీయం. అనవసరంగా ఎరువులు వాడకుండా ఖర్చు తగ్గుతోంది. అదనుకు తగ్గట్టు పోషకాలను అందించడం వల్ల దిగుబడి సైతం పెరిగింది. అలాగే రైతు భరోసా కేంద్రాల సిబ్బంది కూడా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారు. సాగుకు కావాల్సిన సలహాలను అందిస్తున్నారు.

– రత్నప్ప, రైతు, కనమనపల్లె, గుడుపల్లె మండలం

లోపాలను గుర్తించే అవకాశం



మా గ్రామంలో ఎక్కువగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నాం. ప్రభుత్వం చేపట్టిన విధానం ద్వారా అందరూ భూసార పరీక్షలు చేయించుకునే అవకాశం వచ్చింది. తద్వారా భూమిలో పోషకాల లోపాలను గుర్తించి ఏమేమి వాడాలో తెలుసుకుంటున్నాం. దీంతో చక్కటి దిగుబడి పొందే వెసులుబాటు వచ్చింది.

– టి.నీరజాక్షులు, రైతు, టి పుత్తూరు, తవణంపల్లె

సమగ్ర సమాచారంతో కార్డులు



జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయిస్తున్నాం. సదరు రైతులకు వారి పొలాల్లోని పోషకాలు ఇతర సమగ్ర వివరాలతో కూడిన కార్డులను అందజేస్తున్నాం. వాటి ఆధారంగా పంటలను సాగు చేసుకుని అధిక ఆదాయం పొందే వెసులుబాటు కల్పిస్తున్నాం. అలాగే ఎప్పటికప్పుడు భూసార పరీక్షలపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖాధికారి, చిత్తూరు

కమనీయం.. పరిణయం!



శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామివారు



ఉత్సవర్లను తీసుకువస్తున్న అర్చకులు



నారాయణగిరి ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక

తిరుమల: తిరుమల నారాయణగిరి ఉద్యానవనాల్లో జరుగుతున్న శ్రీ పద్మావతీ పరిణయోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. పరిణయోత్సవంలో రెండవ రోజైన ఆదివారం వైశాఖశుద్ధ దశమి. ఇదే అసలు అలనాటి సుముహూర్తదినమని పురాణాల ద్వారా తెలుస్తోంది. కనుక ఈ మూడు రోజుల పద్మావతీ పరిణయోత్సవాల్లో రెండవ రోజు ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు శ్రీ మలయప్ప స్వామివారు అశ్వవాహనాన్ని అధిరోహించి వేంచేపు చేయగా, వెంట స్వర్ణ తిరుచ్చిలో శ్రీదేవి, భూదేవి అనుసరించారు. మొదటిరోజు మాదిరే శ్రీవారికి, అమ్మవార్లకు ఎదుర్కోలు, పూలమాలలు మార్చడం, పూల బంతులాట, నూతన వస్త్రధారణ తదితర కార్యక్రమాలు పూర్తయిన తరువాత కొలువు చేపట్టారు. ఈ సందర్భంగా చతుర్వేద పారాయణం, సౌరాష్ట్ర రాగం, దేసిక, మలహరి, యమునా కళ్యాణి, ఆనంద భైరవి నీలాంబరి రాగాలు, వివిధ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. తరువాత అన్నమాచార్య సంకీర్తనలతో ప్రాంగణం అంతా మార్మోగింది. ప్రముఖ హరికథా భాగవతార్ శ్రీ వేంకటేశ్వరులు పద్మావతి శ్రీనివాస పరిణయంపై హరికథా పారాయణం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం శ్రీవారు దేవేరులతో బంగారు తిరుచ్చిలో తిరువీధులగుండా ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేయడంతో రెండవ రోజు పరిణయోత్సవ వేడుక ముగిసింది. డిప్యూటీ ఈఓ లోకనాథం, ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, వీజీవో బాలిరెడ్డి, ఇతర అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి రోజా

సాక్షి, అమరావతి: లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల శాఖ మంత్రి ఆర్‌కే రోజా కొనియాడారు. ఆదివారం బెంగళూరు లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 17వ వార్షిక డిస్ట్రిక్ట్ కన్వెన్షన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ సేవే లయన్స్ క్లబ్ సక్సెస్ మంత్రమన్నారు. వెయ్యేళ్లపాటు నిరంతరం లయన్స్ క్లబ్ సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. వివిధ విభాగాల్లో విశేష సేవలు అందించిన లయన్స్ క్లబ్ సభ్యులకు జ్ఞాపికలు అందించారు. అనంతరం సభ్యుల వినతి మేరకు క్లబ్‌లో సభ్యత్వం తీసుకునేందుకు మంత్రి అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వినిత ప్రకాశ్, సీఎస్ఆర్ సౌత్ ఇండియా అంబాసిడర్ కృష్ణారెడ్డి, భక్తవత్సలరెడ్డి, బుజ్జంగొెట్టి, రామ్‌రాజ్ పాల్గొన్నారు.

బడికి విరామం

- విద్యార్థులకు నేటి నుంచి సెలవులు
- జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం

జిల్లా సమాచారం	
ప్రభుత్వ పాఠశాలలు	2,483
ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు	418
సర్కారు బడుల్లోని విద్యార్థులు	1,70,982
ప్రైవేట్ విద్యాసంస్థల్లోనివారు	73,765



ఐరాల ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్న ఎంఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : ఈ విద్యాసంవత్సరం ముగిసింది. ఆదివారం అయినప్పటికీ రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను నిర్వహించారు. మొత్తం 31 మండలాల్లోని అన్ని సర్కారు బడుల్లో తల్లిదండ్రుల సమావేశాలను ఏర్పాటు చేశారు. 1 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులందరికీ తల్లిదండ్రుల సమక్షంలో ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పిల్లల చదువు పురోగతి, మార్కుల వివరాలను ఉపాధ్యాయులు వివరించారు. జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ఉంటాయని, 12వ తేదీన పాఠశాలలను పునఃప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆయా సమావేశాల ప్రక్రియను డీఈఓ విజయేంద్రరావు, డీవైఈఓ చంద్రశేఖర్, ఆయాన మండలాల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

తరగతులు నిర్వహిస్తే చర్యలు



వేసవి సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో సైతం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని. క్లాసుల నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదు వచ్చినా ఆయా స్కూళ్లకు అనుమతులు రద్దు చేస్తాం. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాం. పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశాం.

– విజయేంద్రరావు, డీఈఓ, చిత్తూరు

తల్లిదండ్రుల సమక్షంలోనే..



అన్ని తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులను ఆదివారం పాఠశాలకు పిలిపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారితో సమావేశం నిర్వహించాం. ఆయా తరగతుల సబ్జెక్టు టీచర్లు సిద్ధం చేసిన విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రుల సమక్షంలోనే అందించాం. వేసవి సెలవుల్లో పిల్లల సంరక్షణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాం.

– రమేష్, ప్రధానోపాధ్యాయుడు, కాశిరాళ్లగొల్లపల్లె హైస్కూల్, యాదమరి మండలం

క్లుప్తంగా

ఉత్తమ సేవకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్

తిరుపతి అర్బన్: జిల్లా పశువైద్యశాఖాధికారి డి.రవికుమార్ అందించిన ఉత్తమ సేవలకు గాను రాష్ట్రస్థాయి ఉత్తమ అడ్మినిస్ట్రేటర్ (కార్య నిర్వాహకుడు) అవార్డు దక్కింది. ఆ మేరకు ఆయన విజయవాడలో శనివారం రాత్రి తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. నిర్ణయించిన 12 అంశాల్లో ఉత్తమ సేవలు అందించిన నేపథ్యంలో జిల్లా పశువైద్యాధికారికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది.

కల్వర్టును ఢీకొన్న బైక్ యువకుడి మృతి



మృతి చెందిన వసీహరన్

బుచ్చినాయుడుకండ్రిగ: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టును ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కారణి గ్రామం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, చెన్నైకి చెందిన భూపతి కుమారుడు వసీహరన్ (22), స్నేహితులతో కలిసి వేర్వేరు ద్విచక్ర ద్విచక్రవాహనాలపై ఆదివారం శ్రీకాళహస్తికి బయల్దేరారు. వసీహరన్ మార్గమధ్యంలోని కారణి గ్రామం వద్ద చెరువు ఒరవ కాలువ కల్వర్టును వసీహరన్ బైక్ ఢీ కొంది. వెంటనే స్నేహితులు ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరుకుని, వసీహరన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మంజునాథరెడ్డి తెలిపారు.

ఉసురు తీస్తున్న 'ఉచ్చులు'

వన్యప్రాణులను వేటాడేందుకు కొందరు ఏర్పాటు చేస్తున్న కరెంట్ ఉచ్చులకు అమాయకులు బలవుతున్నారు.. పంటలు కాపాడుకునేందుకు కొందరు రైతులు వేయిస్తున్న విద్యుత్ కంచెలకు పలువురు ఉసురు పోగొట్టుకుంటున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వేటగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏకంగా 11కేవీ తీగల నుంచే విద్యుత్ చౌర్యానికి పాల్పడి అడవి జంతువుల కోసం వలలు పన్నుతున్నారు. ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అన్నెం పున్నెం ఎరుగనివారు ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తున్నా.. శిక్షలు నామమాత్రంగా ఉండడంతో అక్రమార్కులు యథేచ్ఛగా హద్దులుమీరుతున్నారు.

- రెచ్చిపోతున్న వేటగాళ్లు
- అడవి జంతువులను చంపేందుకు విద్యుత్ కంచెలు ఏర్పాలు
- ప్రాణాలు కోల్పోతున్న అమాయక ప్రజలు
- నిర్లక్ష్యంగా వ్యవహలిస్తున్న ట్రాన్స్‌కో, ఫారెస్ట్ అధికారులు





తవణంపల్లె మండలంలో మేఘనాథం మృతదేహం (ఫైల్), చౌడేపల్లెలో మృతి చెందిన మునేంద్ర (ఫైల్)

పుంగనూరు : కౌండిన్య అటవీ ప్రాంతానికి సమీపంలో సోమల, బంగారుపాళ్యెం, కుప్పం, గుడుపల్లె, పలమనేరు తదితర మండలాలు ఉన్నాయి. అయా చోట్ల వన్యప్రాణులను వేటాడే వేటగాళ్లు అధికంగా ఉన్నారు. అడవి దగ్గరగా ఉండే గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ తీగల నుంచి కరెంట్‌ను అక్రమంగా తీసుకుని జంతువుల కోసం ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారు. వలలో పడి మరణించిన మృగాల మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే అటవీ భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్న కొందరు రైతులు సైతం అడవి పందులు, ఇతర జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ కంచెలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే రాత్రివేళ సంచరించే అమాయక గ్రామీణులు ఈ విషయం తెలియక ఉచ్చుల్లో చిక్కి, కంచె తగలి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నారు.

పెరుగుతున్న మృతులు

కరెంటు ఉచ్చులు, కంచెల బారిన పడి పలువురు మరణిస్తున్నారు. ఈ నెల 17వ తేదీన పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం శెట్టిపేట వద్ద మునీంద్ర, భీరమ్మ దంపతులు విద్యుత్ ఉచ్చు తగలడంతో మృతి చెందారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చేందుకు వేటగాళ్లు ఆ దంపతుల మృతదేహాలను మూటగట్టి బావిలో పడేయడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నెల 23వ తేదీన తవణంపల్లె మండలం బోయపల్లెలో మేఘనాథం (23) అనే ప్రత్యేక ప్రతిభావంతుడు కరెంట్ ఉచ్చుకు బలైన విషయం విధితమే. అలాగే పలమనేరు సబ్ డివిజన్ పరిధిలో మరో 9 మంది ఇదే విధంగా మరణించారు. ఈ క్రమంలో వేటగాళ్ల దురాశ, అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా తాము వీధిన పడ్డామని బాధిత కుటుంబాలు భోరుమంటున్నాయి. ప్రభుత్వం తరఫున ఆర్థికసాయం అందించాలని కోరుతున్నాయి.

కేసులు ముమ్మరం

విద్యుత్ ఉచ్చులు, కంచెలతో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఆయా ఘటనలు ఆధారంగా చేసుకుని ఇప్పటివరకు సుమారు 96 మందిపై కేసులు నమోదయ్యాయి. అయితే ఈ కేసుల్లో శిక్షలు నామమాత్రంగానే ఉండడంతో నిందితులు సులువగా బెయిల్‌పై బయటకు వచ్చేస్తున్నారు. మళ్లీ వన్యప్రాణుల వేటకు సన్నద్ధమవుతున్నారు.

అలసత్వం వీడాల్సిందే!

వేటగాళ్లు విద్యుత్ చౌర్యానికి పాల్పడే సమయంలో నిర్మొహమాటంగా కరెంట్ కట్ చేసేస్తున్నారు. రాత్రివేళ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఎక్కడో కరెంట్ ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారనే స్థానికులు అనుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. వేటగాళ్లతో లాలూచీ పడడం వల్లే ఎలాంటి చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే అటవీప్రాంతంలో బీట్ డ్యూటీ నిర్వహించాల్సిన సిబ్బంది ఆ ఊసే ఎత్తకపోవడంతో వేటగాళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు అలసత్వం వీడాల్సిందే అని, లేకుంటే మరెన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని గ్రామీణులు స్పష్టం చేస్తున్నారు.

కఠిన చర్యలు



పొలాలకు, అటవి జంతువుల వేటకు విద్యుత్ కంచెలు, ఉచ్చులు ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. వేటగాళ్ల మీద పకడ్బందీగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అలాగే రౌడీ షీట్లు ఓపెన్ చేస్తాం. ఎక్కడైనా కరెంట్ తీగలతో కంచెలు, ఉచ్చులు ఏర్పాటు చేస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

– సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ, పలమనేరు



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

కుప్పంలో ఇన్‌చార్జి ఎస్పీ పర్యటన


కుప్పం : పట్టణంలోని పల్లార్లపల్లె, లక్ష్మీపురంలో ఇటీవల ఘర్షణలకు జరిగిన నేపథ్యంలో ఘటనాస్థలాలను ఇన్‌చార్జి ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదివారం సందర్శించారు. అసలు గొడవలు ఎందుకు వచ్చాయి, ఇరువర్గాల్లో తప్పు ఎవరిది అనే విషయాలను ఆరా తీశారు. రెండు ప్రాంతాల్లో శాంతిభద్రతల సమస్యల తలెత్తకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

బస్సు ఢీకొని ఇద్దరి దుర్మరణం

గూడూరురూరల్: ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీ కొనడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. పలమనేరుకు చెందిన అంబూరు వంశీనాథ్(38) సెరికల్చర్ అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. స్నేహితుడు అల్తూరు జయరాజ్(25)ను కలిసేందుకు వంశీనాథ్ నాయుడుపేటకు వచ్చారు. జయరాజ్ బైక్‌పై ముత్తుకూరులోని బంధువుల ఇంటికి వెళుతుండగా పోటుపాళెం క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొంది. గాయపడిన ఇరువురినీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

కాలభైరవుడికి...మగబీర ఆకుల దీపం





విశేష అలంకరణలో కాళభైరవ స్వామి, ఆలయం వద్ద మగబీర ఆకుతో దీపం వెలిగిస్తున్న బాబు

సత్యవేడు: సరిహద్దులోని దొమ్మర మేడు పంచాయతీలో 500 ఏళ్ల క్రితం వెలసిన కాలభైరవ ఆలయంలో స్వామి వారి పూజకు ఒక భక్తుడు మగభీర ఆకులతో దీపం వెలిగించి పూజలు చేస్తున్నాడు. భక్తులందరూ నూనె దీపాలు వెలిగిస్తుండగా, బాల్‌రెడ్డి కండ్రిగకు చెందిన జే.బాబు(ఏసుపాదం) ఆకుల రాసాన్ని నూనెగా పోసి పత్తి ఒత్తులకు బదులు పచ్చటి మగబీర ఆకును వత్తిగా చుట్టి వెలిగిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఆలయంలో పౌర్ణమి ,అమావాస్య ముందు వచ్చే అష్టమి తిథి రోజుల్లో కాలభైరవ ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. బాల్ రెడ్డి కండ్రిగకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జే.బాబు కుటుంబీకులు వందేళ్లకు పైగా ఆకులతో దీపం వెలిగిస్తుండడం ఆనవాయితీగా వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆకుటుంబానికి చెందని బాబు(ఏసుపాదం) మగబీర ఆకు మూలికల నూనెతో దేవాలయం ముందు దీపం వెలిగిస్తూ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

తైలంకు వాడే ఆకులు

గరిక, జిల్లేడు పూలు, మారేడు ఆకు, తుమ్మాకు, తులసి, ఉత్తరేణి, కొండ తులసి, మద్ది ఆకులతో తీసిన తైలంను దేవుని పూజకు నూనెగా వినియోగిస్తున్నారు. ఆలయంలో దేవుని ముందు ప్రమిధలో ఆకు తైలంనూనెతో దీపం వెలిగిస్తున్నారు. ఈ దీపం గాలి ఒత్తిడిని తట్టుకొని వెలుగుతోంది.

వసూళ్ల పంచాయితీ!

- పరువుతీసేస్తున్నారంటూ అధికారుల ఆగ్రహం
- డీడీఓలు బెదిరిస్తున్నారంటూ సర్పంచ్‌ల ఆవేదన

సాక్షి ఎఫెక్ట్..

గుడిపాల : పంచాయతీల్లో డీడీఓల చేతివాటంపై అధికారులు మండిపడుతున్నారు. ×పిండేస్తున్నారు× పేరిట ఈ నెల 26వ తేదీన సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనంపై దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం మండల పరిషత్ కార్యాలయంలో డీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల మంజూరుకు మామూళ్లు వసూలు చేయడంపై ఆరా తీసినట్లు సమాచారం. సాక్షి పత్రికలో వచ్చిన కథనాన్ని దగ్గర పెట్టుకుని మరీ అంశాల వారీగా విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే పలువురు డీడీఓలు ఏమాత్రం సంకోచం లేకుండా ఆడిట్ పనులకు మామూళ్లు తీసుకోవడం సాధారణమైన విషయమని సమాధానం ఇచ్చినట్లు సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు వెల్లడిస్తున్నారు. ఏ బిల్లు వచ్చినా రూ.500లకు మించి తీసుకోవడం లేదని, బర్త్, డెత్ సర్టిఫికెట్లకు కేవలం రూ.100 మాత్రమే వసూలు చేస్తున్నామని ముక్తాయించినట్లు చెబుతున్నారు. ఇక చేసేది లేక అధికారులు మీ పాట్లు మీరు పడడండి అంటూ సమావేశం నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. చిల్లర వసూళ్లను గుట్టుగా చేసుకోవాలి కానీ, ఇలా బయటపడి పరువుతీశారంటూ మండిపడినట్లు సమాచారం. కొసమెరుపు ఏంటంటే.. వసూళ్ల పర్వానికి తెరతీసిన డీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు మాత్రం తాము చేసిన పనిని సమర్థించుకుంటున్నారు. సాక్షిలో కథనం వచ్చేదానికి మీరే కారణమంటూ సర్పంచ్‌లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఫోన్‌పే ద్వారా నగదు పంపిన వివరాలను ఎలా బయటపెడతారని నిలదీస్తున్నారు. ఇకపై ఇలా చేస్తే బిల్లుల విషయంలో ఇక్కట్లు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ముస్తాబైన పెంచలకోన

శోభాయమానంగా పెనుశిల క్షేత్రం



- లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. అంకురార్పణతో సోమవారం రాత్రి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది పైగా భక్తులు వస్తారని అంచనా. శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గోనుపల్లిలోని శ్రీపెనుశిలస్వామి వారి ఆలయం నుంచి పల్లకిలో కాలినడకన పెంచలకోనకు తీసుకెళ్లడం ఆనవాయితీ. రాత్రి కోనలో జరిగే అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి,

గోనుపల్లిలో సందడి

పెనుశిల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో గోనుపల్లి గిరిజనవాడలో పండగ వాతావరణం నెలకొంది. నరసింహస్వామి చెంచుల అల్లుడు కావడంతో ఈ బ్రహోత్సవాలు, కల్యాణం, తమ ఇంట్లో జరిగే శుభకార్యంగా గిరిజనులు భావిస్తారు. ఈ క్రమంలో గిరిజన కాలనీలోని చెంచులు తమ ఇళ్లకు రంగులు వేసుకుంటారు. ప్రతి ఇంటి ముందు పందిళ్లు వేసుకుంటారు. గోనుపల్లిలోని పెనుశిల ఆలయం నుంచి ప్రతి ఏటా శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కాలినడకన పెంచలకోనకు తీసుకెళ్లడం ఆనవాయితీ. పెంచలస్వామికి లాంఛనాలు అందజేసేందుకు గిరిజనులు తెల్లవారుజామున అడవికి వెళ్లి పుట్టతేనె, ఇంజేటిగడ్డలు, సారపప్పు, తదితర సరుకులను తీసుకువచ్చి స్వామివారికి సమర్పిస్తారు. కట్నంగా ఆరినార మొలతాడు అందజేస్తారు.

నేటి నుంచి ప్రారంభం

పెంచలకోన బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 7గంటలకు గోనుపల్లి పెనుశిల దేవస్థానం నుంచి స్వామి, అమ్మవార్ల విగ్రహాలు పెంచలకోనకు చేరుకుంటా యి. రాత్రి 8 గంటలకు అంకురార్పణ, 9గంటలకు సేనాధిపతి ఉత్సవం జరగనుంది. ఈ ఉత్సవాలు 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 2వ తేదీ ధ్వజారోహణం, శేషవాహనసేవ, 3న ఉదయం హంస వాహనసేవ, రాత్రి బంగారు హనుమంత వాహనం, 4న సింహ వాహనం, గరుడ వాహన సేవ, 5న కల్యాణోత్సవం, రథోత్సవం, అశ్వవాహన సేవ, 6న చక్రస్నానం, తెప్పోత్సవం, 7న స్వామి అమ్మవార్లకు గోనుపల్లిలో నిర్వహించే క్షేత్రోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.




ఆలయానికి వెళ్లే మార్గంలో చలువ పందిళ్లు

ప్రత్యేక బస్సులు ఏర్పాటు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు, వైఎస్సార్ జిల్లా, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి 120 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు.నెల్లూరు,గూడూరు,రాపూరు, వెంకటగిరి ,ఆత్మకూరు,ఉదయగిరి,వాకాడు,కావలి వెంకటగిరి,గూడూరు నుంచి 85 సర్వీసులు , వైఎస్సార్ జిల్లా ను ంచి కడప,మైదుకూరు,రాజంపేట ,బద్వేల్ నుంచి బస్సులు నడపనున్నట్లు ఆయన చెప్పారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉత్సవాల సమయంలో ప్రతి రోజూ రాత్రి వేల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. క్యూలో మంచినీరందిస్తాం. దేవస్థానం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు 60 మంచినీటి కుళాయిలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. లడ్డూల కొరతలేకుండా సిద్ధం చేస్తున్నా. ప్రత్యేక ఆకర్షణ ఉండేలా విద్యుద్దీపాలంకరణ, చలువ పందిళ్లు, క్యూలను సిద్ధం చేశాం. దేవస్థాన పరిధిలోని అన్ని అతిథి గృహాల్లో నూతన దుప్పట్లు, వేడినీరు, దిండ్లు, ఏసీలు ఏర్పాటు చేశాం. ప్రత్యేక వైద్య శిబిరాలు, ఆక్సిజన్ సిలిండర్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. – జనార్దన్ రెడ్డి, ఆలయ ఈవో

ప్రతిభే ప్రాతిపదికగా క్రికెట్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

నగరి : ఆర్‌కే రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల ఎంపిక పోటీలు చేపట్టారు. ఆదివారం పట్టణంలోని కేవీకే మైదానంలో జరిగిన పోటీల్లో ప్రతిభే ప్రాతిపదికన జిల్లా జట్లను ఎంపిక చేశారు. అండర్ 19 విభాగంలో 12 మంది, అండర్–16లో 12 మంది, ప్రతి జట్టులోను ఐదుగురిని స్టాండ్‌బైగా ఎంపిక చేసినట్లు శాప్ కోచ్ బాబు తెలిపారు. వీరికి త్వరలోనే ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లోకనాథం, కృబాకరన్ పాల్గొన్నారు.